క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం


విరాళం అందజేస్తున్న దాత

డోన్: మహా శివరాత్రి సందర్భంగా శివమాలధారులకు మండలంలోని దొరపల్లె గ్రామ శివాలయంలో నిత్యాన్నదానం ఏర్పాటు చేశారు. ఇందు కోసం వైఎస్సార్‌సీపీ డోన్ మండల మాజీ అధ్యక్షుడు దొరపల్లె చిరంజీవి రూ.10 వేల విరాళం అందజేసినట్లు శివాలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. 40 రోజుల పాటు ఆలయం ఆవరణలో అన్నదానం జరుగుతుందన్నారు.

మైక్‌సెట్ వితరణ


కళాశాలకు మైక్‌సెట్ అందజేస్తున్న దాత

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో దాత మార్రెళ్ల రాజశేఖర్‌రెడ్డి రూ.16,500 విలువ చేసే మైకు సెట్టును శనివారం విరాళంగా అందజేశారు. దాతకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఓబుల్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై వ్యక్తిగత వికాసం, పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి సూచనలు చేశారు. కార్యక్రమంలో సమితి వ్యవస్థాపకుడు మలిశెట్టి జగన్‌మోహన్, అధ్యక్షుడు నాగభూషణంరెడ్డి, కోశాధికారి రంగయ్య, రోటరీక్లబ్ అధ్యక్షుడు కంబాలపాడు శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

గ్యాస్ స్టవ్ విరాళం


గ్యాస్ స్టవ్‌ను అందజేస్తున్న దాత


డోన్ టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు శిక్షకుడిగా పనిచేస్తున్న బద్దల కోదండరాముడు శనివారం గ్యాస్ సిలిండర్, స్టవ్‌ను విరాళంగా ఇచ్చారు. తన తండ్రి నాగయ్య కూడా ఐటీఐలో శిక్షకుడిగా పనిచేశారని.. ఆయన జ్ఞాపకార్థం అందజేసినట్లు దాత తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి, శిక్షకులు సూర్యశేఖర్ రెడ్డి, ధర్మాకర్, కోదండ రామయ్య, బద్దల ప్రసాద్, స్థానిక భారత్ గ్యాస్ డీలర్ రాజా విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం


మాట్లాడుతున్న మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి

బనగానపల్లె రూరల్: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి అన్నారు. శనివారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో సంఘం నాయకులు, సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆదివారం కర్నూలులో జరగనున్న రాయలసీమ మాలల యుద్ధ గర్జనను విజయవంతం చేయాలని కోరారు. రాజకీయ స్వార్థం కోసం ఎస్సీ వర్గీకరణ చేస్తే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, బొల్లి మద్దిలేటి, శివుడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన


విద్యార్థులతో అగ్నిమాపక సిబ్బంది

డోన్ టౌన్: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని డోన్ అగ్నిమాపక కేంద్రం అధికారి రంగస్వామిగౌడ్ అన్నారు. పట్టణంలోని భాష్యం స్కూల్ విద్యార్థులకు శనివారం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ×అగ్ని ప్రమాదాలు–నివారణ చర్యలు× అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లీడింగ్ ఫైర్‌మెన్ ప్రభాకర్ అగ్ని ప్రమాదాల రకాలు, నివారణ చర్యలను విద్యార్థులకు వివరించారు. ఇంటిలో గ్యాస్ సిలిండర్లు, ఫ్యాక్టరీలు, షాపింగ్ మాల్స్, వ్య వసాయ పంటలు, పశుగ్రాసంలో మంటలు చెల రేగినప్పుడు ఆర్పే విధానంపై అవగాహన కల్పించారు.

జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక

కోవెలకుంట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు నేషనల్ మీన్స్ మెరిట్(ఎన్‌ఎంఎంఎస్) స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం రాజయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విష్ణువర్ధన్, తేజ అనే విద్యార్థులు ప్రవేశ పరీక్షలో ప్రతిభచాటి ఉపకార వేతనాలకు ఎంపికయ్యారన్నారు. వీరికి ఐదేళ్ల పాటు ఏటా రూ. 12 వేల చొప్పున ఉపకార వేతనం అందుతుందని పేర్కొన్నారు. ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు.

చీకటి బాధలు

- మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ స్కూల్‌లో సింగిల్ ఫేజ్ విద్యుత్
- తరచూ విద్యుత్‌కు అంతరాయం
- రాత్రి సమయాల్లో విద్యార్థుల ఇక్కట్లు
- కలెక్టర్ ఆదేశించినా చర్యలు శూన్యం


గోరుమానుకొండ సమీపంలోని ఎంజేపీ హైస్కూల్, కళాశాల

బేతంచెర్ల: కోటను తలపించే భవనం.. విశాలమైన గదులు, ఆహ్లాదకరమైన పరిసరాలు.. ఇది బేతంచెర్ల మండలం గోరుమానుకొండ సమీపంలోని మహాత్మా జ్యోతిరావు పూలే (ఎంజేపీ) హైస్కూల్, కళాశాల ప్రత్యేకత. అయితే ఏం లాభం తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రెసిడెన్షియల్ స్కూల్‌లో సుమారు 700 మంది విద్యార్థులు చదువుతున్నారు. సింగిల్ ఫేజ్ విద్యుత్ లైన్ ఉండడంతో తరచూ ఫ్యూజ్‌లు పోతున్నాయి. సకాలంలో లైన్‌మెన్లు రాకపోవడంతో విద్యార్థులు అంధకారంలోనే మగ్గుతున్నారు. త్రీఫేజ్ విద్యుత్ అవసరమైనా అధికారులు దృష్టిసారించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.

త్రీఫేజ్ విద్యుత్‌లైన్ లేక ఇక్కట్లు

ఇక్కడ నూతన భవన నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి బుగ్గన చొరవతో రూ. 36 కోట్ల నిధులు మంజూరయ్యాయి. బేతంచెర్ల పట్టణంలోని మెయిన్ జెడ్పీ హైస్కూల్ భవనంలో కొనసాగుతున్న జ్యోతిరావు పూలే హైస్కూల్, కళాశాల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా లేకపోవడంతో గత ఏడాది 70 శాతం వరకు పూర్తయిన గోరుమానుకొండ సమీపంలోని నూతన భవనంలోకి విద్యార్థులు వచ్చారు. ప్రస్తుతం పనులు చివరి దశకు చేరుకున్నాయి. విద్యార్థులకు అధునాతనమైన భవనం అందుబాటులో ఉన్నా సింగిల్ ఫేజ్ విద్యుత్ లైన్ కారణంగా ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి వేళలో నీటి సమస్య తలెత్తుతోంది. ఒక్కోసారి లైన్‌మెన్ రాకపోతే రాత్రంతా విద్యార్థులు చీకటిలోనే భయాందోళన మధ్య గడపాల్సిన పరిస్థితి. త్రీఫేజ్ విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం సుమారు రూ.40 లక్షలు ఖర్చు అవుతుందని విద్యుత్‌శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. అయితే నిధులు మంజూరు కాకపోవడంతో కష్టాలు కొనసాగుతున్నాయి. జనవరి 31వ తేదీ స్కూలు, కళాశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ రాజకుమారికి ఉపాధ్యాయులు, విద్యార్థులు సమస్యను విన్నవించారు. విద్యుత్ త్రీఫేజ్ లైన్ ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అయినా నేటికీ కార్యరూపం దాల్చలేదు. పది, ఇంటర్ పరీక్షలు దగ్గరపడ్డాయి.. విద్యుత్ అంతరాయంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


ప్రస్తుతమున్న సింగిల్ ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొలిమిగుండ్ల: స్థానిక మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి శనివారం తెలిపారు. ఈనెల 25 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ప్రక్రియ ప్రారంభమై మార్చి 31తో ముగుస్తుందన్నారు. ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. మండలంలో ఐదో తరగతి చదివే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

డోన్: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కేశీరాజు శ్రీనివాస్ తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులు 150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 పరీక్ష ఫీజు చెల్లించి ఈ నెల 24వ తేదీ నుంచి మార్చి 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఏప్రిల్ 20వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

కృషి, పట్టుదల ఉంటే విజయం తథ్యం


మాట్లాడుతున్న గోవిందు

కొలిమిగుండ్ల: విద్యార్థులు ఎంచుకున్న లక్ష్య సాధన కోసం పట్టుదల, కృషి, ప్రణాళిక అవసరమని జమ్మలమడుగుకు చెందిన ప్రముఖ వక్త గోవిందు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థుల ఫేర్‌వేల్‌ను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నైతిక విలువలు బోధించి గురువుల పాత్ర సమాజంలో అనన్యమైందని కొనియాడారు. కష్టపడితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చెప్పారు. అధ్యాపకులు చెప్పిన మాటలు ఆచరించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. తల్లితండ్రులు ఎన్నో కష్టాలు పడి చదివిస్తున్నారని వారి శ్రమ వృథా చేయకుండా మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ప్రతి ప్రయత్నం చివరి ప్రయత్నంగా భావించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. కార్యక్రమంలో ఎంఈఓ అబ్దుల్ కలాం, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు శ్రీనివాసులురెడ్డి, బాల ఓబయ్య పాల్గొన్నారు.

ప్రైవేట్ వాటర్ ప్లాంట్లకు ఉచిత విద్యుత్‌పై ధ్వజం

- టీడీపీ నేతలకు ట్రాన్స్‌కో అధికారుల సహకారం
- సర్వసభ్య సమావేశంలో వివిధ సమస్యలపై సభ్యుల ఆగ్రహం


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి

కోవెలకుంట్ల: మండలంలోని వెలగటూరులో ప్రైవేట్ మినరల్ వాటర్‌ప్లాంట్లకు గ్రామ పంచాయతీకి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నారని సర్పంచ్ ఎల్వీ సుధాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ట్రాన్స్‌కో శాఖపై చర్చకు రాగా గ్రామంలో ప్రైవేట్ వ్యక్తులు అనధికారికంగా వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేసుకుంటున్నారని, వీటికి గ్రామ పంచాయతీ కరెంట్‌ను వాడుకోవడమేమిటని సర్పంచ్ ప్రశ్నించారు. విచారణ జరిపి విద్యుత్ సరఫరాను తొలగించాలని ట్రాన్స్‌కో ఏఈ అనంతరావును కోరారు. అలాగే పట్టణంలోని 13వ వార్డులో విద్యుత్ స్తంభం నేలకొరిగి ప్రమాదం పొంచి ఉందని స్తంభాన్ని సరిచేయాలని మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్ సభ దృష్టికి తెచ్చారు. రెవెన్యూ శాఖపై చర్చకు రాగా ప్రతి నెలా ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ పంపిణీ ప్రక్రియ కొనసాగుతోందని, వెలగటూరు గ్రామంలో ఇందుకు విరుద్ధంగా డీలర్ తన ఇంటి వద్ద రేషన్ పంపిణీ చేస్తున్నారని ఎంపీపీ రమాదేవి సభ దృష్టికి తెచ్చారు. దీనిపై విచారణ జరిపించాలని ఎంపీపీ తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డిని ఆదేశించారు. జోళదరాశిలో పంచాయతీ ఆధ్వర్యంలో ఉచిత మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే గ్రామానికి చెందిన కొందరు అడ్డు తగులుతున్నారని సర్పంచ్ నాగేంద్ర అధికారుల దృష్టికి తెచ్చారు. అనంతరం విద్య, వైద్య, ఉపాధి, పశు వైద్యం, గ్రామీణ నీటిసరఫరా, విద్యుత్, వ్యవసాయ, తదితర శాఖలపై చర్చ జరిగింది. మండల ఉపాధ్యక్షుడు విజయపాల్, మండల కో ఆప్షన్‌మెంబర్ దిల్కాబాషా, ఎంపీడీఓ వరప్రసాద రావు, మండల వ్యవసాయాధికారి నిరంజన్, పంచాయతీరాజ్, హౌసింగ్ ఏఈలు చెంచయ్య, రమణారెడ్డి, డాక్టర్లు విద్యాసాగర్, రాబర్ట్ కెన్నెడి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకం.. లాభదాయకం


శిక్షణలో మాట్లాడుతున్న డీడీ

ప్యాపిలి: గొర్రెల పెంపకాన్ని లాభదాయకంగా మార్చుకోవాలని గొర్రెల పెంపకందార్ల శిక్షణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ వెంకటరెడ్డి, ఏడీలు రామసుబ్బారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి అన్నారు. హుసేనాపురం గ్రామంలోని గొర్రెల పెంపకందార్ల శిక్షణ కేంద్రంలో నిర్వహించిన ముగింపు సమావేశంలో వారు మాట్లాడారు. గొర్రెల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన మెళకువలను వివరించారు. గొర్రెలకు సీజనల్‌గా సంక్రమించే వ్యాధులను ఎప్పటికప్పుడు గుర్తించి చికిత్స చేయించాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయించాలన్నారు. శిక్షణ కేంద్రానికి వచ్చే వారికి మూడు రోజుల పాటు భోజన వసతి, డార్మిటరీ సౌకర్యం కలదన్న విషయాన్ని ఇతర రైతులకు తెలియజేయాలన్నారు. ఈ నెల 27, 28, మార్చి 1వ తేదీల్లో మరో బ్యాచ్‌కు ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు జానకి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రేనాటి సూర్యుడికి నివాళి

- ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి


కోవెలకుంట్ల: నరసింహారెడ్డి విగ్రహానికి నివాళి

కోవెలకుంట్ల: స్వాతంత్ర్య సమరయోధుడు, బ్రిటీష్ వారిని గడగడలాడించిన విప్లవ వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని శనివారం నిర్వహించారు. పట్టణంలోని శివాలయం పక్కనున్న ఆయన విగ్రహానికి మానవతా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు రామచంద్రరాజు, ఎమ్మార్పీఎస్ నేత సుబ్బరాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మండలంలోని గోవిందిన్నె మెట్ట సమీపంలో నిత్యాన్నదాన కేంద్రం వద్ద ప్రకృతిపీఠం అధ్యక్షుడు పల్లె నరసింహారెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం నారాయణస్వామి నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కరీంబాషా, దాట్ల సుబ్బారెడ్డి, వెంకటన్న, రెడ్డిపల్లి ఓబయ్య, బాషా, రామసుబ్బయ్య, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, ప్రకృతి పీఠం సభ్యులు శివ, ఏరాసు మహేశ్వరరెడ్డి, నాగార్జున, సాంబశివుడు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.



ఎం.గోవిందిన్నె మెట్టలో..


బేతంచెర్ల: నివాళులర్పిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

ఆదర్శంగా తీసుకోవాలి

బేతంచెర్ల: ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని యువత ఆదర్శంగా తీసుకోవాలని మండల రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. శనివారం పట్టణంలోని రెడ్డి సంక్షేమ సంఘం కార్యాలయంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. సంఘం నాయకులు భాస్కర్ రెడ్డి, మధు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నాగభూషణం రెడ్డి, రమేష్ రెడ్డి, భరత్ రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

ప్యాపిలి: స్థానిక వెంకటరెడ్డి ఆలయంలో తిరునాలను పురస్కరించుకుని శనివారం వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి కల్యాణానికి గ్రామ పెద్దలు హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తిరునాల ప్రారంభమయ్యాయి. దుకాణాల వద్ద సందడి వాతావరణం నెలకొంది.

గోమాతకు అంత్యక్రియలు


గోమాతకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న సభ్యులు

డోన్: పట్టణంలో మృతిచెందిన గోమాతకు ద్రోణాచలం సేవాసమితి ఆపద్బాంధవ బృందం శనివారం అంత్యక్రియలు నిర్వహించింది. పట్టణ ఎస్‌ఐకు జీపు డ్రైవర్‌గా పనిచేస్తున్న జిలానీబాషా తన ఇంటి వద్ద పెంచుకుంటున్న ఆవు ఆకస్మికంగా మృతిచెందడంతో విషయాన్ని ఆపద్బాంధవ బృందానికి తెలియజేశాడు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు షాదిఖాన రాజు ఆధ్వర్యంలో సభ్యులు హిందూ సంప్రదాయం ప్రకారం గోమాతకు అంత్యక్రియలు నిర్వహించారు.

నివాళి

బనగానపల్లె: మండలంలోని జోలాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బాబుల్(60) గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి శనివారం బాబుల్ ఇంటికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

లారీ డ్రైవర్ మృతికి సంతాపం

ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కమ్మరి బాలకృష్ణుడు (53) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డోన్ మోటర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ భాస్కర్ రెడ్డి, శివరాం శనివారం నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. లారీడ్రైవర్లు పాల్గొన్నారు.

ఆక్రమణల అడ్డగింత

ప్యాపిలి: మండల పరిధిలోని గార్లదిన్నె గ్రామ సమీపంలో ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు శనివారం జేసీబీతో చదును చేస్తున్నారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు పోలీసులతో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి పనులను అడ్డుకున్నారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

నలుగురిపై వరకట్న వేధింపుల కేసు

కోవెలకుంట్ల: ప్రేమ వివాహం చేసుకున్న యువకుడు అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తుండడంతో బాధితురాలు శనివారం పోలీసులను ఆశ్రయించింది. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి అందించిన సమాచారం మేరకు.. కోవెలకుంట్లకు చెందిన హరిణి ఇదే పట్టణానికి చెందిన సాదిక్ ఉసేన్ ప్రేమ వివాహం చేసుకున్నారు. మూడేళ్ల పాటు వీరి దాంపత్య జీవితం సజావుగా సాగింది. కొన్ని రోజుల నుంచి అదనపుకట్నం కోసం భర్త, అత్తమామలు, అవ్వ వేధింపులకు గురి చేస్తుండడంతో హరిణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నలుగురిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పేద ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు


ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్: స్థానిక సబ్ జైలును సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్‌పర్సన్ తంగమణి శనివారం సందర్శించారు. ఖైదీలతో సమావేశమయ్యారు. బెయిల్ దరఖాస్తు, జామీన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి స్వతహాగా న్యాయవాదిని ఏర్పాటు చేసుకోవడానికి ఆర్థిక స్థోమత లేనివారికి ప్రభుత్వం తరపున ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జైలులో సత్ప్రవర్తనతో ఉండాలని.. బెయిల్‌పై బయటకు వెళ్లిన తరువాత సమాజంలో ప్రశాంత జీవనం గడపాలన్నారు. సబ్ జైలులో ఖైదీలకు అందించే ఆహారం, వసతి, వైద్య సేవలపై ఆరా తీశారు. జైలు సూపరింటెండెంట్ రఘునాథరెడ్డి, కోర్టు సిబ్బంది ఉన్నారు.


ఇరుముడులతో బయలుదేరుతున్న శివస్వాములు

శ్రీశైలానికి శివస్వాములు

కొలిమిగుండ్ల: గొర్విమానుపల్లెలో శివదీక్ష స్వీకరించిన స్వాములు శనివారం శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు. 50 మంది శివస్వాములు గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుడు ఆలూరి రాఘవేంద్రప్రసాద్ స్వాములకు ఇరుముడులు కట్టించారు. శివనామ స్మరణ మధ్య వాహనాల్లో శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు.


విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

బనగానపల్లె రూరల్: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానంద ఆచారి అన్నారు. శనివారం నందివర్గం గ్రామంలోని ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై పలు సూచనలు చేశారు. కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలన్నారు. చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

లెప్రసీ కాలనీలో నీటి కుండల పంపిణీ

డోన్: వేసవిని దృష్టిలో ఉంచుకుని లెప్రసీ కాలనీవాసులకు దాతలు శనివారం మట్టి నీటి కుండలను పంపిణీ చేశారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మాజీ హెచ్‌ఎంలు కళావతి, గ్రేసమ్మ వీటిని అందజేశారు. ప్రార్థన సమయం నిర్వాహకుడు జాన్‌ప్రభాకర్ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.


కుండలు పంపిణీ చేస్తున్న రిటైర్డు హెచ్‌ఎంలు

ధ్యాన మందిర ప్రారంభానికి ఆహ్వానం


మాజీ ఎమ్మెల్యే కాటసానికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న నిర్వాహకులు

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రంలోని నాలుగు కాళ్ల మండపం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ధ్యాన మందిర ప్రారంభోత్సవానికి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి శనివారం ఆహ్వానపత్రిక అందజేశారు. సదాశివ శ్రీగురుదక్షిణామూర్తి అచల ఆశ్రమం పీఠాధిపతి గురుమద్దిలేటిస్వామి, కమిటీ సభ్యులు కాటసానిని ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించారు. ఈ నెల 26వ తేదీ ఉదయం 8.30 గంటలకు ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. ఆశ్రమ కమిటీ సభ్యులు ఎం. వెంకటేశ్వరరెడ్డి, అల్లె శ్రీనివాసరెడ్డి, ఎస్.రాజాబాబు, ప్రసాద్, రవి, మాహబూబ్‌బాషా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


నాయగాళ్ల బాబు

బేతంచెర్ల: నాపరాయిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి టిప్పర్ ఢీకొనడంతో యువకుడు మృతిచెందిన ఘటన శనివారం తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా ఇటిక్యాలపాడు వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. బేతంచెర్ల మండలం గోర్లగుట్ట గ్రామానికి చెందిన సామేలు, చెన్నమ్మ దంపతుల కుమారుడు నాయగాళ్ల బాబు(30) నాపరాతి లోడింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గ్రామం నుంచి నాపరాయి లోడుతో గద్వాలకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన బాబును ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతునికి భార్య వరలక్ష్మి, నలుగురు పిల్లలు ఉన్నారు.

హుసేనాపురం చెరువు పరిశీలన

ప్యాపిలి: మండల పరిధిలోని హుసేనాపురం చెరువును డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి శనివారం పరిశీలించారు. హెచ్‌ఎన్‌ఎస్ఎస్ ద్వారా చెరువుకు చేరుతున్న నీటిని పరిశీలించిన ఆయన పలు విషయాల గురించి అధికారులతో చర్చించారు. చెరువులకు నీటిని నింపే కార్యక్రమం యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని అన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అసిస్టెంట్ సీఈఓగా బాధ్యతలు

కోవెలకుంట్ల: మండలంలోని భీమునిపాడు సహకార సంఘం అసిస్టెంట్ సీఈఓగా పగడాల ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. దొర్నిపాడు సహకార సంఘంలో పనిచేస్తున్న ఆయన్ను భీమునిపాడుకు బదిలీ చేశారు. అందరి సహకారంతో సహకార సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.